ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 5 మే 2025 | 5



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0 (ఆదివారం)
కనిష్ఠం : 25.0



ఎవరి నమ్మకాలు..
వారివి!

నీట్‌లో తమ పిల్లలు ర్యాంక్ సాధించాలనేది తల్లిదండ్రుల ఆశ.. ఆ ఆశను నిజం చేసుకోవాలని రాజ మహేంద్రవరం ఎస్‌కేవీటీ పరీక్షా కేంద్రం వద్ద ఒకరు ప్రార్థన చేస్తుంటే.. మరొకరు తాడుకడుతూ.. ఇంకొకరు జాగ్రత్తలు చెబుతూ ఇలా కెమెరాకు చిక్కారు..



గెలుపుతాడు..



కంగారుపడకు..



దేవుడు..చూస్తాడు..



రెడీ 1 | 2 | 3 ఆశలు..బంద్!

ఒక నిమిషం ఆలస్యమై..
ఏడాదంతా తారుమారై!

ఆగదు ఏ నిమిషం నీ కోసము అన్నాడో సినీ కవి..అది అక్షరాలా నిజం.. ఒక్క నిమిషం చాలు జీవితాలు తారుమారైపోవడానికి.. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కేంద్రంలో నీట్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు..కాస్త ముందు వచ్చిన ఇద్దరమ్మాయిలు పరుగున పరీక్షా కేంద్రానికి చేరుకోగా..ఈ బాలుడు మాత్రం నిమిషం ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయడానికి వీల్లేక వెనుదిరిగాడు.. ఒక్క నిమిషం విలువ ఎంతో తెలుసా..మరో ఏడాదే.- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

రుణం ఈజీ కాదు..!



సర్కారు వారి మాటా బ్యాంకులు వినవే!

రుణం అంత ఈజీకాదు.. ప్రభుత్వం తరపున అర్హులని ఎంపిక చేసినా సరే రుణం రాదు.. వెనుక ఏదో ఒక హామీ లేనిదే బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకు రావు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం..అటు పాలకుల నుంచి ఇటు అధికారుల వరకూ చెప్పేది ఇదే.. వారిచెప్పినట్టు జరుగుతుందా అంటే జరగదు.. కార్పొరేషన్ రుణాలే అందుకు ఉదాహరణ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,303 యూనిట్లకు అర్హులను ఎంపిక చేసి 19 బ్యాంకులకు పంపగా కేవలం 1423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- కార్పొరేషన్ రుణాలకు చుక్కలు
- 6,178 మంది లబ్ధిదారుల ఎంపిక
- 1,423 మందికే లోన్లు మంజూరు
- మిగిలిన దరఖాస్తులు పెండింగ్
- రుణాలివ్వడానికి బ్యాంకుల కొర్రీలు
- రకరకాల కారణాలతో మోకాలడ్డు
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి తూట్లు

కార్పొరేషన్ల రుణాలకు బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. లబ్ధిదారులను వడపోత ద్వారా అర్హులను పక్కాగా గుర్తించి రుణాల మంజూరుకు జాబితాలను బ్యాంకులకు పంపితే రకరకాల సాకుతో తిరస్కరించేస్తున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పథకాలకు ఎంపిక చేసిన 6,178 మంది లబ్ధిదారుల వివరాల ను 19 బ్యాంకులకు పంపగా వీరిలో కేవలం 1,423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ఆమోదం తెలిపాయి. మిగిలిన దరఖాస్తుల్లో కొన్ని తిరస్కరించగా.. మరికొన్ని పెండింగ్‌లో ఉంచేశాయి.

ఎంపికకే నానా తంటాలు..

గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ,కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాలకు మంగళం పాడేసింది. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి అందివ్వాల్సిన యూనిట్లను సైతం పక్కన పడేసింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది బీసీ, కాపు సామాజికవర్గాల పేదలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చంద్రబాబు తాజాగా సీఎం అయిన తర్వాత మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 7,303 యూనిట్లు కేటాయించారు. స్వయం ఉపాధి యూనిట్లకు వీలుగా 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఎంపికైన లబ్ధిదారుడు జనరిక్ మందుల దుకాణం ఏర్పాటకయ్యే రూ.8 లక్షల్లో రూ.4 లక్షలు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ భరిస్తుండగా మిగిలిన రూ.4 లక్షలు రుణం మంజూరు చేస్తారు. ఇలా రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలకు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించింది.ఈ పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా స్పందన వచ్చింది. మంజూరైన యూనిట్లు 7,303 దరఖాస్తు చేసుకున్నవారు 1.11 లక్షల మంది.ఎలాగైనా పథకం తమకే దక్కాలని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. దరఖాస్తులన్నీ పరిశీలించిన అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,303 మంది లబ్ధిదారులను అతికష్టంపై ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా నుంచి 2,684 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2,314, కోనసీమ జిల్లా నుంచి 2,305 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రభుత్వం తరపున సబ్సిడీ అందేలా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు.వీరందరికి బ్యాంకు రుణాలు అందేలా ఆయా మండలాల్లో ఎండీవోలు సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లకు సిఫార్సు చేశారు.సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు.

పేదలకు సిబిల్ స్కోర్ లేదట?

ఉమ్మడి జిల్లాలో ఆయా మండలాల వారీగా ఎండీవోలు లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు పంపించారు. తీరా వీటిని పరిశీలించిన బ్యాంకులు రుణాలివ్వడానికి నానా తిప్పలు పెడుతున్నాయి. లబ్ధిదారుడి సిబిల్ స్కోరు బాగోలేదని.. గతంలో బ్యాంకు రుణం సరిగ్గా చెల్లించలేదని, గతంలో వేరే పథకానికి ఎంపికయ్యారని తదితర కారణాలతో ఎక్కడికక్కడ రుణాలివ్వ కుండా తిరస్కరిస్తున్నాయి.ఎంపిక చేసిన యూనిట్‌కు రుణం ఇవ్వడానికి కుదరదంటూ రకరకాల సాకులు చెబుతున్నాయి. కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులంతా నిరుపేదలు.వీరికి అసలు సిబిల్ స్కోరు గురించి కనీస అవగాహన ఉండదు.కానీ ఆ పేరుతో రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తుండడంతో ఆయా పేద లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం చొరవ చూపి పేదలకు సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

1423 మందికి మాత్రమే..

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ జిల్లాలో 19 బ్యాంకులకు అధికారులు 2,478 మందిని ఎంపిక చేసి దరఖాస్తులు జాబితా పంపారు. వీటిలో కేవలం 722 మందికే బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి.199 తిరస్కరించగా 1,557 పెండింగ్‌లో ఉంచేసి వీటిని కూడా రేపోమాపో తిరస్కరిస్తున్నట్టు వెల్లడించనున్నాయి. ఎస్‌బీఐకి 773 దరఖాస్తులు పంపితే 243 మంజూరు చేసి 98 దరఖాస్తులను తిరస్కరించింది. మరో 432 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. యూనియన్ బ్యాంకుకు 746 మంది జాబితా పంపితే 242 మందికే రుణాలు మంజూరు చేసింది. 40 దరఖాస్తులను తిరస్కరించి 464 పెండింగ్‌లో ఉంచేసింది.

తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలో 15 బ్యాంకులకు 2,062 మంది జాబితా పంపగా కేవలం 353 మందికే రుణాలివ్వడానికి అంగీకరించాయి. 66 మంది రుణ దరఖాస్తులు తిరస్కరించగా 1,643 పెండింగ్‌లో ఉంచేశాయి. స్టేట్ బ్యాంకుకు 657 దరఖాస్తులు పంపితే 84 మంది రుణాలకు మాత్రమే ఓకే చెప్పింది. 12 మందివి తిరస్కరించి 511 పేర్లు పెండింగ్‌లో ఉంచేసింది. ఇండియన్ ఒవర్సీస్ బ్యాంకుకు 57 పేర్లు పం పితే ముగ్గురికే రుణం మంజూరు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ,పంజాబ్ నేషనల్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకు ఒక్క లోను ఇవ్వలేదు.

కోనసీమ

కోనసీమ జిల్లాలో 14 బ్యాంకులకు 1,638 పేర్లు పంపితే 348 మందికి మాత్రమే లోన్లు మంజూరయ్యాయి. 205 దరఖాస్తులు తిరస్కరించగా 1,085 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేశాయి.కెనరా బ్యాంకుకు 100 పంపితే 35 మందిని తిరస్క రించింది.చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు 115 పంపితే 30 తిరస్క రించింది. స్టేట్‌బ్యాంకుకు 509 పంపితే 34 మందికే రుణాలిచ్చి 21 పేర్లు తిరస్కరించింది. యూనియన్ బ్యాంకుకు 532 పంపితే 161 మందికే లోన్లు ఇవ్వగా 85 తిరస్క రించింది. వేలల్లో పేర్లను బ్యాంకులు తిరస్కరిస్తుండడంతో అటు బీసీ కార్పొరేషన్, ఇటు ఎండీవోలు తలలు పట్టుకుంటున్నారు.ఒకనైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.



సత్యదేవుడి కల్యాణం

చూడగ రారండి!

- 7 నుంచి 13 వరకు ఉత్సవాలు
- అన్నవరంలో ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, మే 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ప్రతి ఏటా వైశాఖశుద్ధ దశమి నుంచి వైశాఖ బహుళపాడ్యమి వరకు జరుగుతాయి. విశ్వావసు నామసంవత్సరంలో ఉత్సవాలు 7న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేయడంతో ప్రారంభమై 13వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగ మహోత్సవంతో ముగుస్తాయి. దివ్యకల్యాణం 8న రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. స్వామి కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాకారం, గోపురాలకు రంగులు వేస్తున్నారు. స్వామివారి సన్నిధిలో జరిగే వేడుకల్లో వార్షిక కల్యాణోత్సవాలకు ప్రాధాన్యం ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచి దివ్యకల్యాణం తిలకించేందుకు వేలాదిగా రత్నగిరికి తరలివస్తారు. ఇప్పటికే పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.వారం రోజులు కొండపై వైదిక కార్యక్రమాలతో పాటు కొండదిగువన గ్రామోత్సవాలు (వివిధ వాహనసేవలు) నిర్వహిస్తారు. దివ్యకల్యాణోత్సవాలకు పెండ్లిపెద్దలుగా క్షేత్ర పాలకులైన సీతారాములు వ్యవహరిస్తారు. వారం రోజులు ఆర్జితసేవ నిత్యకల్యాణం తాత్కాలికంగా నిలుపుదల చేస్తారు. ఉత్సవాలకు బడ్జెట్‌లో రూ.50 లక్షలు కేటాయించారు.

షెడ్యూల్ ఇలా..

- తొలిరోజు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు సీతారాములను వెండి అంజనేయ వాహనంపై ఊరేగిస్తారు.
- రెండోరోజున రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణం.సత్యదేవుడిని వెండి గజవాహంపై, అమ్మవారిని వెండి గరుడ వాహనంపై పెండ్లి పెద్దలైన సీతారాములను వెండి పల్లకిలో ఊరేగిస్తారు.
- మూడో రోజు సాయంత్రం 6.30 గంటలకు నవదంపతులకు అరుంధతీ నక్షత్ర దర్శన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 9 గంటలకు కొండదిగువన రావణబ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం జరగనుంది.
- నాలుగోరోజున మధ్యాహ్నం 2.30 గంటలకు పండిత సదస్యం ఉంటుంది. పండితులు సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నూతన దంపతుల సమక్షంలో తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు.రాత్రి 9గంటలకు పొన్నవాహనంపై గ్రామోత్సవం.
- ఐదోరోజు నూతన దంపతులైన సత్యదేవుడు,అనంతలక్ష్మీ అమ్మవార్లను మధ్యాహ్నం 2.30 గంటలకు దేవస్థానం ఉద్యానవనానికి తీసుకువచ్చి వనవిహార మహోత్సవం చేపడతారు. సాయంత్రం 4 గంటలకు పెద్దరథంపై గ్రామోత్సవం
- ఆరో రోజున ఉదయం 5 గంటలకు శేష హోమాలు, కోట్నాలు నిర్వహించి పండితులుఅమ్మవారితో గౌరీపూజ చేయిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు.
- చివరి రోజున రాత్రి 8 గంటలకు నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో, స్వామి,అమ్మవార్లను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీ తాంబూలాలు, మహిళలకు రవికలను ఉచితంగా అందజేస్తారు.



నన్నయ వర్సిటీ వద్ద సందడి.. నీట్ పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న జేసీ చిన్నరాముడు ఆర్‌డీవో కృష్ణనాయక్ తదితరులు

నీట్‌గా ముగిసింది!

- జిల్లాలో 8 కేంద్రాలు
- 2690 మంది హాజరు
- 70 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజమహేంద్రవరం/ దివాన్‌చెరువు, మే4 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నీట్ (యుజీ)-2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నీట్ పరీక్షలకు 2690 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. చివరి నిమి షంలో పరుగులు షరా మామూలుగానే కని పించాయి. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకూ పరీక్ష జరిగింది. అయితే అభ్యర్థులను అంతకంటే ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. జేసీ చిన్న రాముడు స్వీయ పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలను ఎస్‌బీఐ స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించారు.దీంతో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ ఆర్ట్స్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రశాంతి తనిఖీ చేశారు.కేశవరానికి చెందిన ఓ విద్యార్థి భారతీయ విద్యాభవన్‌లో చదువుతున్నాడు. ఎస్‌కేవీటీ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉంది. ఆ విద్యార్థి కారులో వచ్చినా ఎస్‌కేవీటీకి మూడు గేట్లు ఉండ డంతో అయోమయానికి గురయ్యాయని..ఎంట్రన్స్ గేటు వద్దకు వచ్చేసరికి సమయం మించి పోయిందని ఆవేదన చెందాడు. 12 నిమిషాలు ఆలస్యం కావడంతో అతడిని పరీక్షకు అనుమతించలేదు.గర్ల్స్ హైస్కూల్‌లో పరీక్ష రాయాల్సి ఉండగా.. ఎస్‌కేవీటీకి వచ్చిన ఆ విద్యార్థినిని ఓ మహిళా కానిస్టేబుల్ తన వాహనంపై గర్ల్స్ కళాశాలకు తీసుకెళ్లడంతో చివరి నిమిషంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చు కుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 720 మంది విద్యార్థులకు 693 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు కె.సుబ్బారావు, పి.విజయనిర్మల తెలిపారు. పరీక్షా కేంద్రాలను జేసీ చిన్నరాముడు, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ శ్రీకాంత్, రాజానగరం తహశీల్దార్ జి.ఎ.ఎల్.ఎస్.దేవి, సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ సందర్శించారు.విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

వానావరణం!

మారిన వాతావరణం

- మండు వేసవిలో జోరువానలు
- పల్లపు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- అన్నదాతల్లో అయోమయం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజమహేంద్రవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇది ఎండాకాలమా.. వానాకాలమా.. కాదు కలి కాలం.. ఇదీ జనం మాట.. ఎందుకంటే నిండు వేసవిలో జోరువానలు చూసి నోటమాట రావడంలేదు. వానలకు పట్టణ జనాభా సేదతీరుతుంటే పల్లె జనం మాత్రం పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా ప్రతి రోజూ ఉదయం ఎండ కారణంగా ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరై సాయంత్రం వానతో సేదతీరుతున్నారు. అయితే ఆదివారం మాత్రం వరుణుడు భానుడికి చోటివ్వలేదు.. తెల్లవారుజాము నుంచే దంచి కొట్టాడు. రాజమహేంద్రవరంలో ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటలకు ఏకధాటిగా కురిసిన వానతో జనజీవనం స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే వర్షం ఆరంభం కావడంతో మార్కెట్లకు వెళ్లడానికి కూడా జనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం నుంచి కాస్త తెరిపిచ్చింది. సోమవారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈదురుగాలులు లేకపోవడం కాస్త ఉపశమనం కలిగించింది. తాళ్లపూడి మండలంలో గరిష్ఠ వర్షపాతం నమోదు కాగా.. నిడదవోలులో కనిష్ఠంగా వర్షపాతనమోదైంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో డ్రెయినేజీలు షరా మామూలుగానే పొంగి పొర్లాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా మునిసిపల్ కార్పొరేషన్ సొమ్ములను ఖర్చు పెట్టి డ్రెయినేజీలు నిర్మించారు. అయినా ముంపు సమస్య నుంచి నగరాన్ని బయటపడేయలేకపోయారు. డ్రైన్లలోని మురుగునీరు రోడ్లపై పారడం, పల్లపు ప్రాంతాలు చెరువులను తలపించడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. రైల్వేస్టేషను, తమ్మలావ,కంబాల చెరువు, ఆర్టీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఎప్పటి మాదిరిగానే రోడ్లపై, వీధుల్లో ముంపు నీరు నిలిచిపోయింది. ద్విచక్ర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ముందస్తు జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు.ప్రమాదకర హోర్డింగ్‌లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు లైన్లను గమనిస్తూ ఉండాలన్నారు. భారీ హోర్డింగ్‌లను తనిఖీ చేసి ఏదైనా ఇబ్బంది వస్తుందని గుర్తిస్తే వెంటనే తొలగించాలని ఆదేశించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి నిరంతరాయంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు రోజులు పని చేసే విధంగా జిల్లా కేంద్రం,డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. వర్షాల వల్ల ప్రతికూల పరిస్థితులు తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1070 1800 425 0101, 83339 05022 లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 89779 35611, రాజమహేంద్రవరం ఆర్డీవో 0883 2442344, కొవ్వూరు ఆర్డీవో 85006 67698కి సమా చారం అందించాలన్నారు.

వర్షపాతం ఇలా..

మండలం	వర్షం(మి.మీ)
తాళ్లపూడి	65.00
కొవ్వూరు	57.25
రాజమండ్రి అర్బన్	49.00
సీతానగరం	41.25
కోరుకొండ	36.50
గోపాలపురం	32.0
సీతానగరం	29.5
రాజానగరం	24.75
బిక్కవోలు	23.75
అనపర్తి	20.25
నల్లజర్ల	19.75
రంగంపేట	19.25
ఉండ్రాజవరం	15.50
నిడదవోలు	13.50



వానొచ్చే : రాజమహేంద్రవరంలో ఆదివారం ఉదయం జోరువాన



రోడ్డా..చెరువా : రాజమహేంద్రవరంలో పల్లపు ప్రాంతాల జలమయం



అన్నదాత ఆందోళన : దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద ఇలా...

చాలా నీట్‌గా..!


రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం


చెవి దిద్దులు తీసివేస్తూ...


జడలో క్లిప్పు తొలగిస్తూ...

నీట్ పరీక్షలు అంటే తొలుత గుర్తొచ్చేది తనిఖీ అంశం. అధికారులు, పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆదివారం రాజమహేంద్రవరం, కాకినాడ కేంద్రాల వద్ద విద్యార్థులు నీట్ పరీక్ష రాసేందుకు సంసిద్ధమైన దృశ్యాలే ఇవి




కాకినాడలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి కోసం వర్షంలో కుటుంబసభ్యులు

ముత్యాల తలంబ్రాలు 30వేల ప్యాకెట్లు సిద్ధం

సత్యదేవుని కల్యాణం తిలకించే భక్తులకు అందజేసే ఏర్పాట్లు


ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

అన్నవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వతేదీ రాత్రి జరిగే సత్యదేవుని కల్యాణం సందర్భంగా స్వామి,అమ్మవార్లు ఒకరిపై ఒకరు వేసుకునే ముత్యాల తలంబ్రాలను అధికారులు ప్యాకింగ్ రూపంలో తయారుచేస్తున్నారు. సుమారు 30వేల ప్యాకెట్లను తయారుచేసి కల్యాణం అనం తరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా కల్యాణం వీక్షించేందుకు విచ్చేసే భక్తులకు అందజేయనున్నారు. సేవాసంస్థ మహిళలకు ఈ బాధ్యతను అప్పగించారు.

వెండివాహనాలకు మెరుగులు

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 7నుంచి ప్రారంభమయ్యే గ్రామసేవల్లో స్వామి,అమ్మవార్ల ఊరేగింపునకు వినియోగించే వెండివాహనాలకు మెరుగులు దిద్దుతున్నారు. కాకినాడకు చెందిన శ్రీ లక్ష్మీశ్రీనివాస జ్యూయలరీ వర్క్స్ అధినేత పాటోజు వెంకట లక్ష్మణమూర్తి, ఆయన బంధుమిత్రులు ఈ పనిని ఉచితంగా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తొలిరోజున వెండి ఆంజనేయవాహనం, రెండోరోజున వెండి గరుడవాహనం, వెండిగజవాహనం, వెండిపల్లకి, స్వామి, అమ్మవార్లు కల్యాణానికి ఆసీనులయ్యే వెండి సింహాసనం, వెండిరథం త దితర సేవలు కల్యాణోత్సవాల్లో జరగనున్నాయి.


వెండి వాహనాలకు తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

పలు సేవలు నిలుపుదల

ఈనెల 7 నుంచి 13 వరకు సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా పలు ఆర్జితసేవలను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణం, ఆయుష్యహోమం, సహస్రదీపాలంకరణ సేవ, పంచహారతులసేవ, శుక్రవారం జరిగే చండీహోమం, శనివారం జరిగే ప్రాకారసేవ, ఆదివారం జరిగే రథసేవ, పౌర్ణమిరోజున జరిగే ప్రత్యంగిర హోమాలు నిలుపుదల చేస్తామని భక్తులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరారు.

ఆహ్వానపత్రికల అందజేత

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలకు రావాలని ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూలకు ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహ 'బరి'తం..

- కాకినాడ సాగరతీరంలో ముగిసిన కబడ్డీ పోటీలు
- పురుషుల విజేత నెల్లూరు
- మహిళల విజేత కృష్ణా

సర్పవరం జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మూడు రోజులు జరిగిన బీచ్ కబడ్డీ పోటీలు ఆద్యంతం అలరించాయి. అలల హోరు మధ్య కూతల మోతతో కాకినాడ సముద్ర తీరం మార్మోగింది. ఫ్లడ్‌లైట్ల వెలుగులో.. అభిమానుల గోలతో అక్కడంతా సందడి వాతావరణం నెలకొంది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సౌజన్యంతో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో జ రుగుతున్న 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి, అమలాపురం, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు తిలకించారు.

విజేతల వివరాలు...

చివరిరోజు మహిళల విభాగంలో చిత్తూరు-కృష్ణా జిల్లాల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగంలో నెల్లూరు, ప్రకాశం జట్లు హోరాహోరీగా తలపడగా నెల్లూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా ప్రకాశం జట్టు నిలిచింది. విజేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ బహుమతులను ప్రదానం చేశారు.


పురుషుల చాంపియన్ నెల్లూరు జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



మహిళల చాంపియన్ కృష్ణా జట్టు



వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశేష అభిషేక పూజలు, చండీహోమం


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో నాల్గోరోజు ఆదివారం గవ్యాంతము, విశేష అభిషేక పూజలు, చండీహోమం, కళాహోమం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సాయంత్రం స్వామివారు నంది వాహనంపై ఆసీనులై మురమళ్ళ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సదస్యం, సభపూజ, పండిత సత్కారం కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూల విరాట్లను ప్రత్యేకంగా అలంకరించి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అయోధ్య రామధనస్సుకు పూజలు

అయోధ్య రాముని కోసం తయారుచేసిన ధనస్సుకు భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం అయోధ్య రాముని కోసం కిలో బంగారం, 13 కిలోల వెండితో ధనస్సును తయారు చేయించారు. ధనస్సుకు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మేళతాళాలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్ వద్ద యనమండ్ర సత్యసీతారామశర్మ, యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసులో శిక్ష పడుతుందనే భయంతో..

● వ్యక్తిని హత్య చేసిన యవకుడు ● అరెస్ట్ చేసిన నిడదవోలు పోలీసులు


ఘటనా స్థలంలో షేక్ వలీ బాషా మృతదేహం


ఫైల్‌ఫొటో


హత్య చేసిన అనిల్‌కుమార్

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అల్లరి చేసిన కేసు కోర్టులో తుది దశకు రావడంతో శిక్ష పడుతుందనే భయంతో, అమ్మాయి కుటుంబసభ్యులు రాజీకి రాకపోవడంతో ఆదివారం ఉదయం యువకుడు వ్యక్తిని హత్య చేశాడు. హత్యచేసిన అరగంటలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ పివి జి.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణం పాటిమీద చింతచెట్టు వీధిలో నివాసముంటున్న షేక్ వలీ బాషా (46) ఆదివారం ఉదయాన్నే నిద్ర లేచి తన ఇంటి కింద ఉన్న కిల్లీ షాపు తె రుస్తుండగా స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన శిరంగుల అనిల్‌కుమార్ వేటకత్తితో వలీ బాషాను హత్య చేసినట్టు మృతుడి భార్య షేక్ రెహనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ అయిన అనిల్‌కుమార్ 2021లో వలీ బాషా కుమార్తెను అల్లరి చేయడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతుంది. తనపై కేసు ఉండడంతో పెళ్లి కావడంలేదని, మరోపక్క ఈ కేసులో శిక్ష పడుతుందనే భయంతో అనిల్ వలీ బాషాను రాజీ చేసుకుందామంటూ చాలా కాలంగా తిరుగుతున్నాడు. అయితే వలీ బాషా కుటుంబసభ్యులు రాజీకి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అనిల్ పథకం ప్రకారమే వేటకత్తితో వచ్చి వలీ బాషాపై దాడి చేసి హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందిన అరగంటలోనే సీఐ తిలక్ సిబ్బందితో అనిల్‌ను అరెస్ట్ చేశారు. మృతుడి భార్య షేక్ రెహానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రేపు ఖేలో ఇండియా బీచ్ క్రీడల ఎంపికలు

కార్పొరేషన్(కాకినాడ), మే 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 24 వరకు డయ్యూ, యుటి ఆఫ్ దాదర్, నగర్ హవేలి, డామన్, డయ్యూలో జరగబోయే ఫస్ట్ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ క్రీడలు 2025కు రాష్ట్రం తరుపున బీచ్ కబడ్డీ(పురుషులు, బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్(మహిళలు), సెపక్ తక్ర(పురుషులు, మహిళలు) జట్లను ఎంపిక ఎంపికలు మంగళవారం జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు మంగళవారం ఆయా జిల్లాల్లో నిర్వహించే ఎంపికలకు హాజరుకావాలని, ఆయా జిల్లాల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారులను సంప్రదించాలని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. మే 6న బీచ్ కబడ్డీ (పురుషులు), బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్ (మహిళలు) ఎంపికలకు క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లా కృష్ణానది వద్ద జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నెంబరు 9394494645 నెంబరును సంప్రదించాలన్నారు. ఓపెన్ ఏజ్ కేటగిరి, క్రీడా ఆధారిత వయో పరిమితి ఏదైనా ఉంటే వాటి ఆధారంగా వయస్సు నిర్ధారణకు ఆధార్‌కార్డు లేదా పాస్‌పోర్టు, పదో తరగతి మార్కుల లిస్ట్, జనన ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారులు రాష్ట్రంలో స్థానిక నివాసం, పాస్ పోర్టు, స్కూల్ బోనఫైడ్, ఉద్యోగం చేస్తుంటే పోస్టింగ్ ప్రదేశం, ఈ మధ్యనే గెలుపొందిన క్రీడాపత్రాలు, పాస్ పోర్టు ఫోటోలు తీసుకెళ్లాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సమస్యల పరిష్కారానికి సహకారం : ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం హామీ ఇచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో యుపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. యూపీఈఐఎఫ్ ఫౌండర్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సంఘాల పిలుపుతో ఈనెల 7న తలపెట్టిన 'చలో విజయవాడ'కు అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యలో యాజమాన్యాల సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పునాదిలో పాము

కొట్టి చంపిన గ్రామస్తులు


హతమైన పాము

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పునాది రంధ్రాల్లో పాములు సంచరిస్తూ ఉండడంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో ఆదివారం స్థానికులు అమర్చిన వలలో 4 అడుగుల పాము చిక్కుకుంది. దాంతో గ్రామస్తులు పామును హతమార్చారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

రూ.4.57 లక్షల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.57 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు. భక్తుల కోసం ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలందజేశారు.


క్యూలో బారులుతీరిన భక్తులు

వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ


ఆలయంలో భీమకవి విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాధ శివాచార్య ఆధ్వర్యం లో భైరవబొట్ల మాచరి బ్రహ్మాజి శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, పలు హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు భారీఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, లారీ ఓనర్స్ అధ్య క్షుడు దుగ్గన బాబ్జి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు బండే తాతాజీ, పీజీ సత్యనారాయణ, దుగ్గ న బాబ్జి, మీసాల రాంబాబు, పాలిక వీర్రాజు, పాలిక సూరిబాబు, కమిడి భీమశంకర్, పుణ్యమంతుల అప్పారావు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

భారీ వర్షంతో నిలిచిన పాపికొండల బోటు

దేవీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అధికారులు పాపికొండలకు వెళ్లే బోటును నిలిపివేశారు. రోజూ పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి విహారయాత్రికులు పాపికొండలకు వెళ్తుంటారు. ఆదివారం ఉదయం ఈదురుగాలులతో వర్షం కురవడంతో అధికారులు పర్యాటక బోటును నిలిపేశారు. 250మంది అడ్వాన్స్ బుక్ చేసుకున్నారు. అయితే అక్కడికి వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు.

మాజీ మంత్రి ఇంట్లో దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కెఎస్.జవహర్ ఇంట్లో దొంగలు పడి రూ. 2,40,000 విలువైన వస్తువులు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నందమూరు రోడ్‌లో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ మాజీ మంత్రి కెఎస్.జవహర్ కుటుంబసభ్యులు గత నెల 28న ఇంటి తాళాలు పెట్టి తిరువూరు మండలం గానుగపాడు వెళ్లారు. ఈనెల 3న సాయంత్రం 4-30 గంటల సమయంలో మొక్కలకు నీళ్లు పోయడానికి వీధి రాజు వచ్చాడు. ఇంటి వెనుక తులపులు తెరచి ఉండడంతో జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్‌కు సమాచారం అందించాడు. హుటాహుటిన వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. హాలులో తలుపులు పగలగొట్టి బెడ్‌రూమ్‌లోని 3 ఐరన్‌కేఫ్‌ల తలుపులు తెరచి లోపల ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఉన్నాయి. ఇంట్లో అన్నీ పరిశీలించగా 4 బంగారు ఉంగరాలు (సుమారు 4 కాసులు), 4 సిల్వర్ ప్లేట్లు (సుమారు 2 కిలో గ్రాములు), రూ.45 వేలు నగదు, ఒక వాచ్, 32 ఇంచెస్ సామ్‌సంగ్ టీవీ, 2 సామ్‌సంగ్ ఫోన్లు, కొన్ని పట్టుచీరలు కలిపి సుమారు రూ2,40,000 విలువైన వస్తువులు దొంగతనం జరిగినట్టు గుర్తించారు. దీనిపై జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

కొరియర్ కార్యాలయంపై పిడుగుపాటు

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): కొరియర్ సర్వీస్ నిర్వహిస్తున్న గదిపై పిడుగుపడిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురంలో జరిగింది. ఈకంఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్ కార్యాలయంపై పిడుగుపడి కంప్యూటర్, ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలార్పారు. కాలిపోయిన ఎలక్ట్రికల్ పరికరాల విలువ రూ.50వేలుంటుందని నిర్వాహకులు చెప్పారు.

ఆలయం ఆహ్లాదం

ఈ చిత్రం.. అన్నవరం సత్యదేవుని ఆలయంపై అలముకున్న అబ్బులు స్వర్ణ శోభితమై ఆలయ పరిసరాలు మొత్తం ఆహ్లాదరకంగా మారి ఆహా అనిపించిన దృశ్యం

ఫొటోగ్రాఫర్-కాకినాడ



లక్ష్య సాధనకు ప్రతిరూపం భగీరథుడు

కలెక్టర్ ప్రశాంతి


భగీరథుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే4(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు ప్రతిరూపం భగీరథుడు అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన భగీరథ మహర్షి జయంతి కార్యక్రమానికి ఆమె విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకుని రావాలన్న భగీరథుడి లక్ష్యం, చిత్తశుద్ధి, కఠోర సాధన, దృఢ సంకల్పం ద్వారానే సాధ్యమైందని, అతడి జీవితం నుంచి మనం ప్రతిఒక్కరూ స్ఫూర్తి పొందాలని పేర్కొన్నారు. సగం నీళ్ల ఉన్న గ్లాసును చూసి సగమే ఉన్నాయని ప్రతికూల స్వభావికులు భావిస్తే, సానుకూల స్వభావికులు గ్లాసు ఖాళీగా ఉండకుండా సగం నిండే ఉంది అనే ఆశావహ దృక్పథం కలిగి ఉంటారన్నారు. బృహత్తర లక్ష్యాలను సాధించిన వ్యక్తుల నుంచి నిరంతరం ప్రేరణ పొందాలన్నారు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ

రాజమహేంద్రవరం కల్చరల్, మే4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, మళ్లీ సంక్షేమ పథకాలను ప్రారంభించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక జూపూడి ఫంక్షన్ హాలులో సమాఖ్య నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సతీష్ శర్మకు నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వుద్రేవు సూర్య వెంకటరావు సారథ్యంలో ఏర్పాటు చేసిన సత్కార సభలో సతీష్ మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.324 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అనంతరం సతీష్ శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యవాడ దుర్గాప్రసాద్, శ్రీదేవి, పులిపాక ప్రసాద్, కేవీఎల్ఎన్ రామచంద్రమూర్తి, వాడ్రేవు వేణు గోపాలరావు, కొత్తపల్లి సూర్యకుమారి, కలగ ప్రభాకరం, సూరంపూడి కామేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

పౌరహక్కుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు చిట్టిబాబు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

రాజమహేంద్రవరం సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న మారణ కాండను ఆపాలని, మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు కోరారు. రాజమహేంద్రవరం అంబేడ్కర్ భవన్‌లో ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోకన్వీనర్ ఎస్‌కే మస్తాన్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అనేక మందిని చంపుతోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కల్పించడానికి కేంద్రం చొరవ చూపాలన్నారు. సమావేశంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు రమ, వేమన ఫౌండేషన్ నాయకుడు ఆచంట వరప్రసాద్, హ్యూమన్ రైట్స్ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాతపూడి ప్రకాష్, దళిత ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ గోదావరి కవితా సంచిక ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, మే4(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సర్వ కళలకు ఆధారమని ప్రముఖ వక్త, గాయకుడు దుర్భ శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ఎస్సీవోస్ హోమ్‌లో ఆదివారం జరిగిన సాహితీ గోదావరి ఉగాది కవితా సంచిక ఆవిష్కరణ సభకు ఆయన విచ్చేసి మాట్లాడారు. సాహితీ గోదావరి అధ్యక్షుడు ర్యాలి శ్రీనివాస్ మాట్లాడుతూ సాహిత్యం కేవలం ఆనందం కోసం కాకుండా సమాజం కోసమనే ఉద్దేశ్యంతో రచయితలు చైతన్యవంతమైన రచనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా 20 మంది కవులు కవితా గానం చేశారు. వారిని అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. అలాగే ఉగాది పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కవులు ముప్పి కామేశ్వరరావు, వేమూరి రాధారాణి, గరగ రామకృష్ణ, గోపాలకృష్ణ, గాయత్రి, గీతాలత, వినయ్, డీటీ హేమంత్ సింగ్, పెరమాంబ, జోడాల రామారావు, ఆర్వీవీ రాజా, ర్యాలి శ్రీనివాసు పాల్గొన్నారు.

యూపీఎస్సీ 274 ర్యాంకర్ వినయ్‌కు అభినందన సభ



రాజమహేంద్రవరం అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ-2025 ఫలితాల్లో 274వ ర్యాంకు సాధించిన బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన దొమ్మేటి వినయ్ అభినందన సభ ఆదివారం రాత్రి రాజమహేంద్రవరంలో జరిగింది. కాకతీయ చారిటబుల్ అసోసియేషన్ కోసేరు మురళీ కృష్ణసాయి సౌజన్యంతో నిర్వహించిన ఈ సభకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, కంటిపూడి సర్వారాయుడు, నీరుకొండ వీరన్న చౌదరి, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసు, నలబాటి రామాంజనేయులు, సన్మానగ్రహీత వినయ్ తల్లిదండ్రులు దొమ్మేటి జగదీష్, కనకదుర్గ, చెన్నుపాటి భానుప్రసాద్ సమక్షంలో వినయ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వినయ్ కృషి, ప్రతిభను ప్రశంసించారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించినా అత్యున్నత యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కాకతీయ ఛారిటబుల్ అసోసియేషన్ సేవలను పలువురు కొనియాడారు.

కనిపించిన మానవత్వం!



రాజమహేంద్రవరం సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఆదివారం భారీ వర్షం పడుతోంది. అందరు వారికి సమీపంలో ఉన్న షెడ్లు, దుకాణాల నీడకు చేరుకుని వర్షంలో తడవకుండా జాగ్రత్తపడ్డారు. కాని కదలలేని స్థితిలో ఉన్న ఓ యాచకుడు మాత్రం వర్షంలో దేకుకుంటూ రోడ్డు పక్కనే కనిపించాడు. అయ్యో అనే వారే తప్ప దగ్గరకు వచ్చి నీడలోకి తీసుకువెళ్లే వారే లేరు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న స్థానిక వ్యక్తి ఈ యాచకుడిని చూసి చలించి వేడి వేడి టీ తీసుకువెళ్లి అతని చేతికి అందించాడు. కాస్త ఊరటను ఇచ్చాడు. ఈ సంఘటన రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద జరిగింది.

అలరించిన కవి గాయక సమ్మేళనం


పలువురు కవులు, గాయకులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మే 4(ఆంధ్రజ్యోతి): అంబేడ్కరీయం పేరిట కవులు, గాయకుల సమ్మేళనం ఏర్పాటు చేసి ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన అంబేడ్కర్ సేవా కేంద్రం చరిత్రలో ఒక నూతనాధ్యాయంగా నిలుస్తుందని రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు ప్రశంసించారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన కవి గాయక సమ్మేళనంలో రామారావు గాయకుడిగా పాల్గొని తన పాటలతో శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా కేంద్రం చేస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయని నిర్వాహకుడు గుబ్బల రాంబాబు సేవలను కొనియాడారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 100 మంది కవులు, గాయకులు పాల్గొని తమ కవితా గానాలతో అలరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కవి గాయక సమ్మేళనాలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం, నెల్లూరు, జిల్లాల నుంచి కవులు, గాయకులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేసినందుకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కవులు, గాయకులను సత్కరించి జ్ఞాపిక, నగదు ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో కృష్ణారావు, కవులు జి.కూర్మయ్య,జీవీవీ సత్యనారాయణ, ఎంకే బీమారావు, విశ్రాంతి ప్రిన్సిపాల్ పాకా చంద్రరావు, ఎస్.వెంకట్రావు, ఎస్.గంగయ్య, ఈ.శ్రీనివాస్, దువ్వాడ రాజా, ఫణికుమార్, పి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
పలు అభివృద్ధి పనులకు శ్రీకారం


వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, మే 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తూ సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెడుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఇందిరా కాలనీ వద్ద ఎర్రకొండపై రూ.2.35 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి రామపాదాల రేవు వరకు, ఉడతా వారి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ధవళేశ్వరంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా గోదావరి నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికి అందిం చడానికి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మి స్తున్నామని, త్వరలోనే గ్రామంలో అవసరమైన సీసీ డ్రైన్ల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మధ్యలోనే నిలిచిపోయిన ప్రధాన మురుగుడ్రైన్, ఊర కాలువను అభివృద్ధి చేయడానికి అంచనాలు రూపొందించడానికి అధికారులను ఆదేశించారు. పుష్కరాలు నాటికి గోదావరి బండ్ రోడ్డును, ఘాట్లను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. చిన్న చిన్న అభివృద్ధి పనులను ప్రభుత్వంపై ఆధారపడకుండా స్థానికులు ముందుకు వచ్చి చేసుకోవాలన్నారు. దీంతో లైటింగ్ పనులకు కాంట్రాక్టర్ సుబ్బరాజు రూ.2లక్షలను ప్రకటించారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం రూ.4కోట్లతో పంపుహౌస్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు యడ్ల మహేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మచ్చేటి శివసత్యప్రసాద్, పండూరి అప్పారావు, ఆళ్ల ఆనందరావు, పిన్నంటి ఏకబాబు, బత్తిన బ్రదర్స్ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న స్థానిక బోట్ ఆఫీస్ నివాసి గ్రంధి సుజాతకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50 వేలు చెక్కును ఆదివారం గోరంట్ల నివాసంలో ఆమెకు ఎమ్మెల్యే అందజేశారు. యర్రమోతు ధర్మరాజు, పిన్నంటి ఏకబాబు, సావాడ శ్రీనివాస రెడ్డి, వర్రే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రేడులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చ య్యచౌదరి ప్రారంభించారు. అనంతరం వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, కొత్తపల్లి సత్యనారాయణ, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, లక్షణ్, గంగిన నాని తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతర

దివాన్‌చెరువు, మే4 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామ దేవత నూకాలమ్మ జాతర మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో గరగలను, ఘటాన్ని గ్రామంలో ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన గరగలకు, ఘటానికి గ్రామస్థులు పసుపు కుంకుమను , మజ్జిగ వంటివాటిని సమర్పించుకున్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): కిట్స్ ఇంజనీరింగ్‌లో 3వ సంవత్సరం చదువుతున్న హరికేశ్వరి అనే పేద విద్యార్థినికి భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆర్థిక సాయం అందించారు. స్థానిక తిలక్ రోడ్డులో తన కార్యాలయంలో ఆదివారం హరికేశ్వరికి రూ.26 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నట్టు చెప్పారు.

బిక్కవోలులో 8 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు


బిక్కవోలులో మెయిన్ ప్రాథమిక పాఠశాల

బిక్కవోలు, మే 4(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా గత ప్రభుత్వం 117 జీవో ద్వారా ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమైన విషయం విదితమే. అయితే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 117 జీవో వెనక్కి తీసుకోవడంతో బిక్కవోలు మండలంలో 8 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రతిపాదనలు పంపినట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకూ 45 మంది విద్యార్థులు వున్న పంచాయతీలోని ఒక ప్రాథమిక పాఠశాలను ఈ ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఆయా ఎస్ఎంసీల తీర్మానం మేరకు ప్రతిపాదించామన్నారు. ఈ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు వుంటారని, 150 మంది విద్యార్థులు దాటితే ఒక పీఎస్‌హెచ్ఎం పోస్టు కూడా వుంటుందన్నారు. ఇందులో భాగంగా బిక్కవోలు మెయిన్, రంగాపురం మెయిన్, ఇళ్లపల్లి మెయిన్, కొమరిపాలెం నెం.2, కొంకుదురు మెయిన్, మెళ్లూరు ప్రాథమిక పాఠశాల, పందలపాక నెం.1, బలభద్రపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలు ఈ ఆదర్శ పాఠశాలలకు ఎంపిక చేశామన్నారు. అలాగే మండలంలో వీటితో పాటు ఫౌండేషన్ పాఠశాలలు ఐదు(1-2 తరగతులు), బేసిక్ ప్రైమరీ 17(1-5 తరగతులు) పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్టు మండల విద్యాశాఖాధికారి వివరించారు.

నదీ జలాలను పరిరక్షించుకోవాలి

ది గోదావరి స్విమ్మర్స్ క్లబ్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యప్రకాశరావు


పుష్కర్‌ఘాట్‌లో స్వచ్ఛ గోదావరి కార్యక్రమం నిర్వహిస్తున్న రౌతు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ కలుషితమవుతున్న నదీ జలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ది గోదావరి స్విమ్మర్స్ క్లబ్ శాశ్వత గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం గోదావరి స్విమ్మర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పుష్కర ఘాట్‌లో స్వచ్ఛ గోదావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యత వహించి గోదావరిని కాలుష్యం బారి నుంచి కాపాడుకోవాలన్నారు.కార్యక్రమంలో స్విమ్మర్స్ క్లబ్ అధ్యక్షుడు గుబ్బల వెంకటరమణ, నందం లక్ష్మణమూర్తి, మాదాల వెంకటేశ్వరరావు, సూరెడ్డి కృష్ణకు మార్, పీడీ ప్రసాద్, సీహెచ్ ఆంజనేయ ప్రసాద్, పి.విష్ణు చక్ర, రౌతు సూర్యవంశ వరుణ్ పాల్గొన్నారు.

ఋషుల ఆదర్శమే మోక్షానికి మార్గం

క్యాంప్ విజయవంతం

రాజమహేంద్రవరం సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో బ్రహ్మధ్యాన సత్సంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఋషుల ఆదర్శమే మోక్షానికి మార్గం సమ్మర్ క్యాంప్ విజయవంతమైంది. బ్రహ్మధ్యాన సత్సంగ్ సంస్థ జిల్లా అధ్యక్షుడు యనమదల సాయి, వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ మణికంఠ పర్యవేక్షణలో వారం రోజుల పాటు జరిగిన ఈ క్యాంప్ ఆదివారం ముగిసింది. క్యాంప్‌లో సుమారు 40 మంది పాల్గొని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శుద్ధి మార్గాన్ని అనుసరించారు. ఈ క్యాంప్‌లో ప్రతి రోజు ధ్యానం, జపం, ధర్మచర్చలు, ఋషుల జీవితాలపై సత్సంగ్, పక్షులకు నీళ్లు-జీవ రక్షణసేవ, చిన్నారుల ధర్మకథలు-నైతిక అభివృద్ధి వంటి అంశాలు వివరించారు. వివేకవర్ధిని అధ్యక్షురాలు అరవదేవి మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో పాల్గొన్న వారికి ధర్మగ్రంథాలు, పౌష్టికాహారం, సర్టిఫికెట్లు అందించామన్నారు. అనంతరం ధర్మో శోభతే మనుజు అంటూ ఋరుషుల మార్గమే భారతీయ జీవనతత్త్వమని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సాంబశివ, సత్యనారాయణ, దేవి, సాయి, లోవరాజు, మానస, రాజేశ్వరి, మహేష్, వీరబాబు, లోకేష్ పాల్గొన్నారు.

అనవర్తిలో భారీ వర్షం

» పొంగి పొర్లిన డ్రైనేజీలు
» వారపు సంతలో ఇబ్బందులు ఎదుర్కొన్న వ్యాపారులు


వారపు సంతలో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

అనపర్తి మే 4 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్థంభించింది. అనపర్తిలో ఆదివారం వారపు సంత కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు అనేక ఇబ్బందులు పడ్డారు. పలు దుకాణాల్లోకి నీరు చేరడంతో చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. దీనికి తోడు మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వీధులన్నీ మురికి కూపంగా మారాయి. కోతలు పూర్తయి ధాన్యం మిల్లుకు తోలేందుకు కళ్లాలపై ఉంచిన రాశులు తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకున్నారు.

సీతానగరంలో పూర్వ విద్యార్థుల కలయిక


సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు

సీతానగరం,మే 4(ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో కలసి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల వద్ద ఆదివారం కలుసుకుని సందడి చేశారు. 23 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఒక చోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. గత స్మృతులను తలుచుకుని ఆనందించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఆటపాటలతో కాలక్షేపం చేశారు. ఉత్సాహంగా గడిపారు.

వాసవి మాతకు సారె




ధవళేశ్వరం, మే 4 (ఆంధ్రజ్యోతి): వాసవి మాత జయంతోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి శ్రీచక్రానికి కుంకుమార్చనలు నిర్వహించారు. దేవులపల్లి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మత్వంలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ఆర్యవైశ్య కుటుంబాలు వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పువ్వుల కావిళ్లతో మేళతాళాల మధ్య పోలీస్ స్టేషన్ నుంచి ఊరేగింపుగా సారె తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. మహిళా సమాజం ఆధ్వర్యంలో పేరంటం నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

సారె తీసుకెళుతున్న ఆర్యవైశ్యులు, అమ్మవారికి సమర్పించిన సారె

రేపు బీచ్ క్రీడలకు రాష్ట్ర క్రీడాకారుల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 24 వరకూ డయ్యూ యూటీ ఆఫ్ దాదర్ అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూలో జరిగే ఫస్ట్ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ క్రీడలు-2025లకు ఆంధ్ర రాష్ట్రం తరపున క్రీడాకారుల ఎంపికలు ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎంఎం శేషగిరి తెలిపారు. బీచ్ కబడ్డీ (పురుషులు) ఎన్టీఆర్ జిల్లా కృష్ణా నది వద్ద జరుగుతాయని, దీనికి సబంధించి ఎన్టీఆర్ జిల్లా జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని సంప్రదించాలని తెలిపారు. అలాగే, బీచ్ వాలీబాల్ (మహిళలు), బీచ్ ఫుట్‌బాల్ (మహిళలు), సెపక్ తక్ర (పురుషులు, మహిళలు) ఎంపికలు కర్నూలు జిల్లా తుంగభద్ర నది వద్ద జరుగుతాయని, వీటికి సంబంధించి కర్నూలు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ


నర్సాపురంలో ఏగులమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్సీ సోము

కోరుకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సంత మార్కెట్ రోడ్డులో పాత గంటాలమ్మ గుడివీధిలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి ఎమ్మెల్యే దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బదిరెడ్డి దొర, దాశెట్టి శ్రీను, కటకం చలం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏగులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ సోము

మండలంలోని నర్సాపురం గ్రామదేవత ఏగులమ్మ జాతరలో భాగంగా ఐదో రోజైన ఆదివారం సాయంత్రం బీజేపీ జాతీయ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్‌కుమార్, పలువురు కూటమి నాయకులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కార్పొరేట్ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, అట్టడుగు వర్గాలు, అనాథలు, సింగిల్ పేరెంట్ పిల్లలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ విద్య కోసం దరఖాస్తులు కోరుతున్నామని స్పృహ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మధుసూదనరావు, కూర్మారావు, రూపస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఈనెల 7వ తేదీ గడువు అని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాజమహేంద్రవరం కేంద్రంగా రాత పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని, వారికి ఉచితంగా కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు రూపస్‌రావు నెంబర్ 93900 59900ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోని మోడల్ కెరీర్ సెంటర్‌లో సోమవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐదు ప్రముఖ కంపెనీలు రెడ్డిబాబు మోటార్స్, ఎయిర్‌టెల్ 5జీ, ఇన్నావో స్టోర్స్ ఎస్‌బీఐ పేమెంట్, బ్యాంక్ ఆఫ్ బరోడాల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. వీటిలో వివిధ ఉద్యోగాల్లో పనిచేసేందుకు 10వ తరగతి, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8328486787 , 9533221189 నెంబర్లను ఆఫీసు పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, మే 4(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. క్షీర, మహానివేదన చేశారు.అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సీతానగరం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తిపాడు గ్రామంలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్.ఐ ఎ.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు.మిర్తిపాడు శివారున పేకాడుతుండగా ఎస్‌ఐ తన బృందంతో దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.8,750 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 32.0 (ఆదివారం)

కనిష్ఠం : 25.0

ఎవరి నమ్మకాలు..

వారివి!

నీట్‌లో తమ పిల్లలు ర్యాంక్ సాధించాలనేది తల్లిదండ్రుల ఆశ.. ఆ ఆశను నిజం చేసుకోవాలని రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పరీక్షా కేంద్రం వద్ద ఒకరు ప్రార్థన చేస్తుంటే.. మరొకరు తాడుకడుతూ.. ఇంకొకరు జాగ్రత్తలు చెబుతూ ఇలా కెమెరాకు చిక్కారు..



గెలుపుతాడు..



కంగారుపడకు..



దేవుడు..చూస్తాడు..



రెడీ 1



2





3 ఆశలు..బంద్!

ఒక నిమిషం ఆలస్యమై..

ఏడాదంతా తారుమారై!

ఆగదు ఏ నిమిషం నీ కోసము అన్నాడో సినీ కవి..అది అక్షరాలా నిజం.. ఒక్క నిమిషం చాలు జీవితాలు తారుమారైపోవడానికి.. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కేంద్రంలో నీట్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు..కాస్త ముందు వచ్చిన ఇద్దరమ్మాయిలు పరుగున పరీక్షా కేంద్రానికి చేరుకోగా..ఈ బాలుడు మాత్రం నిమిషం ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయడానికి వీల్లేక వెనుదిరిగాడు.. ఒక్క నిమిషం విలువ ఎంతో తెలుసా..మరో ఏడాదే..- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

రుణం ఈజీ కాదు..!



సర్కారు వారి మాటా బ్యాంకులు వినవే!

రుణం అంత ఈజీకాదు.. ప్రభుత్వం తరపున అర్హులని ఎంపిక చేసినా సరే రుణం రాదు.. వెనుక ఏదో ఒక హామీ లేనిదే బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకు రావు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం..అటు పాలకుల నుంచి ఇటు అధికారుల వరకూ చెప్పేది ఇదే.. వారిచెప్పినట్టు జరుగుతుందా అంటే జరగదు.. కార్పొరేషన్ రుణాలే అందుకు ఉదాహరణ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,303 యూనిట్లకు అర్హులను ఎంపిక చేసి 19 బ్యాంకులకు పంపగా కేవలం 1423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- కార్పొరేషన్ రుణాలకు చుక్కలు
- 6,178 మంది లబ్ధిదారుల ఎంపిక
- 1,423 మందికే లోన్లు మంజూరు
- మిగిలిన దరఖాస్తులు పెండింగ్
- రుణాలివ్వడానికి బ్యాంకుల కొర్రీలు
- రకరకాల కారణాలతో మోకాలడ్డు
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి తూట్లు

కార్పొరేషన్ల రుణాలకు బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. లబ్ధిదారులను వడపోత ద్వారా అర్హులను పక్కాగా గుర్తించి రుణాల మంజూరుకు జాబితాలను బ్యాంకులకు పంపితే రకరకాల సాకుతో తిరస్కరించేస్తున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పథకాలకు ఎంపిక చేసిన 6,178 మంది లబ్ధిదారుల వివరాల ను 19 బ్యాంకులకు పంపగా వీరిలో కేవలం 1,423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ఆమోదం తెలిపాయి. మిగిలిన దరఖాస్తుల్లో కొన్ని తిరస్కరించగా.. మరికొన్ని పెండింగ్‌లో ఉంచేశాయి.

ఎంపికకే నానా తంటాలు..

గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ,కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాలకు మంగళం పాడేసింది. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి అందివ్వాల్సిన యూనిట్లను సైతం పక్కన పడేసింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది బీసీ, కాపు సామాజికవర్గాల పేదలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చంద్రబాబు తాజాగా సీఎం అయిన తర్వాత మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 7,303 యూనిట్లు కేటాయించారు. స్వయం ఉపాధి యూనిట్లకు వీలుగా 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఎంపికైన లబ్ధిదారుడు జనరిక్ మందుల దుకాణం ఏర్పాటుకయ్యే రూ.8 లక్షల్లో రూ.4 లక్షలు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ భరిస్తుండగా మిగిలిన రూ.4 లక్షలు రుణం మంజూరు చేస్తారు. ఇలా రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలకు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించింది.ఈ పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా స్పందన వచ్చింది. మంజూరైన యూనిట్లు 7,303 దరఖాస్తు చేసుకున్నవారు 1.11 లక్షల మంది.ఎలాగైనా పథకం తమకే దక్కాలని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. దరఖాస్తులన్నీ పరిశీలించిన అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,303 మంది లబ్ధిదారులను అతికష్టంపై ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా నుంచి 2,684 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2,314, కోనసీమ జిల్లా నుంచి 2,305 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రభుత్వం తరపున సబ్సిడీ అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.వీరందరికి బ్యాంకు రుణాలు అందేలా ఆయా మండలాల్లో ఎండీవోలు సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లకు సిఫార్సు చేశారు.సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు.

పేదలకు సిబిల్ స్కోర్ లేదట?

ఉమ్మడి జిల్లాలో ఆయా మండలాల వారీగా ఎండీవోలు లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు పంపించారు. తీరా వీటిని పరిశీలించిన బ్యాంకులు రుణాలివ్వడానికి నానా తిప్పలు పెడుతున్నాయి. లబ్ధిదారుడి సిబిల్ స్కోరు బాగోలేదని.. గతంలో బ్యాంకు రుణం సరిగ్గా చెల్లించలేదని, గతంలో వేరే పథకానికి ఎంపికయ్యారని తదితర కారణాలతో ఎక్కడికక్కడ రుణాలివ్వకుండా తిరస్కరిస్తున్నాయి.ఎంపిక చేసిన యూనిట్‌కు రుణం ఇవ్వడానికి కుదరదంటూ రకరకాల సాకులు చెబుతున్నాయి. కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులంతా నిరుపేదలు.వీరికి అసలు సిబిల్ స్కోరు గురించి కనీస అవగాహన ఉండదు.కానీ ఆ పేరుతో రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తుండడంతో ఆయా పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం చొరవ చూపి పేదలకు సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

1423 మందికి మాత్రమే..

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ జిల్లాలో 19 బ్యాంకులకు అధికారులు 2,478 మందిని ఎంపిక చేసి దరఖాస్తులు జాబితా పంపారు. వీటిలో కేవలం 722 మందికే బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి.199 తిరస్కరించగా 1,557 పెండింగ్‌లో ఉంచేసి వీటిని కూడా రేపోమాపో తిరస్కరిస్తున్నట్టు వెల్లడించనున్నాయి. ఎస్‌బీఐకి 773 దరఖాస్తులు పంపితే 243 మంజూరు చేసి 98 దరఖాస్తులను తిరస్కరించింది. మరో 432 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. యూనియన్ బ్యాంకుకు 746 మంది జాబితా పంపితే 242 మందికే రుణాలు మంజూరు చేసింది. 40 దరఖాస్తులను తిరస్కరించి 464 పెండింగ్‌లో ఉంచేసింది.

తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలో 15 బ్యాంకులకు 2,062 మంది జాబితా పంపగా కేవలం 353 మందికే రుణాలివ్వడానికి అంగీకరించాయి. 66 మంది రుణ దరఖాస్తులు తిరస్కరించగా 1,643 పెండింగ్‌లో ఉంచేశాయి. స్టేట్ బ్యాంకుకు 657 దరఖాస్తులు పంపితే 84 మంది రుణాలకు మాత్రమే ఓకే చెప్పింది. 12 మందివి తిరస్కరించి 511 పేర్లు పెండింగ్‌లో ఉంచేసింది. ఇండియన్ ఒవర్సీస్ బ్యాంకుకు 57 పేర్లు పంపితే ముగ్గురికే రుణం మంజూరు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ,పంజాబ్ నేషనల్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకు ఒక్క లోను ఇవ్వలేదు.

కోనసీమ

కోనసీమ జిల్లాలో 14 బ్యాంకులకు 1,638 పేర్లు పంపితే 348 మందికి మాత్రమే లోన్లు మంజూరయ్యాయి. 205 దరఖాస్తులు తిరస్కరించగా 1,085 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేశాయి.కెనరా బ్యాంకుకు 100 పంపితే 35 మందిని తిరస్కరించింది.చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు 115 పంపితే 30 తిరస్కరించింది. స్టేట్‌బ్యాంకుకు 509 పంపితే 34 మందికే రుణాలిచ్చి 21 పేర్లు తిరస్కరించింది. యూనియన్ బ్యాంకుకు 532 పంపితే 161 మందికే లోన్లు ఇవ్వగా 85 తిరస్కరించింది. వేలల్లో పేర్లను బ్యాంకులు తిరస్కరిస్తుండడంతో అటు బీసీ కార్పొరేషన్, ఇటు ఎండీవోలు తలలు పట్టుకుంటున్నారు.ఒకనైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అన్నవరం సత్యదేవుడి ఆలయం ముస్తాబు

సత్యదేవుడి కల్యాణం

చూడగ రారండి!

- 7 నుంచి 13 వరకు ఉత్సవాలు
- అన్నవరంలో ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, మే 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ప్రతి ఏటా వైశాఖశుద్ధ దశమి నుంచి వైశాఖ బహుళపాడ్యమి వరకు జరుగుతాయి. విశ్వావసు నామసంవత్సరంలో ఉత్సవాలు 7న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేయడంతో ప్రారంభమై 13వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగ మహోత్సవంతో ముగుస్తాయి. దివ్యకల్యాణం 8న రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. స్వామి కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాకారం, గోపురాలకు రంగులు వేస్తున్నారు. స్వామివారి సన్నిధిలో జరిగే వేడుకల్లో వార్షిక కల్యాణోత్సవాలకు ప్రాధాన్యం ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచి దివ్యకల్యాణం తిలకించేందుకు వేలాదిగా రత్నగిరికి తరలివస్తారు. ఇప్పటికే పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.వారం రోజులు కొండపై వైదిక కార్యక్రమాలతో పాటు కొండదిగువన గ్రామోత్సవాలు (వివిధ వాహనసేవలు) నిర్వహిస్తారు. దివ్యకల్యాణోత్సవాలకు పెండ్లిపెద్దలుగా క్షేత్రపాలకులైన సీతారాములు వ్యవహరిస్తారు. వారం రోజులు ఆర్జితసేవ నిత్యకల్యాణం తాత్కాలికంగా నిలుపుదల చేస్తారు. ఉత్సవాలకు బడ్జెట్‌లో రూ.50 లక్షలు కేటాయించారు.

షెడ్యూల్ ఇలా..

- తొలిరోజు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగిస్తారు.
- రెండోరోజున రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణం.సత్యదేవుడిని వెండి గజవాహంపై, అమ్మవారిని వెండి గరుడ వాహనంపై పెండ్లి పెద్దలైన సీతారాములను వెండి పల్లకిలో ఊరేగిస్తారు.
- మూడో రోజు సాయంత్రం 6.30 గంటలకు నవదంపతులకు అరుంధతీ నక్షత్ర దర్శన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 9 గంటలకు కొండదిగువన రావణబ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం జరగనుంది.
- నాలుగోరోజున మధ్యాహ్నం 2.30 గంటలకు పండిత సదస్యం ఉంటుంది. పండితులు సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నూతన దంపతుల సమక్షంలో తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు.రాత్రి 9గంటలకు పొన్నవాహనంపై గ్రామోత్సవం.
- ఐదోరోజు నూతన దంపతులైన సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లను మధ్యాహ్నం 2.30 గంటలకు దేవస్థానం ఉద్యానవనానికి తీసుకువచ్చి వనవిహార మహోత్సవం చేపడతారు. సాయంత్రం 4 గంటలకు పెద్దరథంపై గ్రామోత్సవం
- ఆరో రోజున ఉదయం 5 గంటలకు శేష హోమాలు, కోట్నాలు నిర్వహించి పండితులుఅమ్మవారితో గౌరీపూజ చేయిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు.
- చివరి రోజున రాత్రి 8 గంటలకు నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో, స్వామి,అమ్మవార్లను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీ తాంబూలాలు, మహిళలకు రవికలను ఉచితంగా అందజేస్తారు.



నన్నయ వర్సిటీ వద్ద సందడి.. నీట్ పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న జేసీ చిన్నరాముడు ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు

నీట్‌గా ముగిసింది!

- జిల్లాలో 8 కేంద్రాలు
- 2690 మంది హాజరు
- 70 మంది విద్యార్థుల గైర్హాజరు

రాజమహేంద్రవరం/ దివాన్‌చెరువు, మే4 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నీట్ (యుజి)-2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నీట్ పరీక్షలకు 2690 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. చివరి నిమి షంలో పరుగులు షరా మామూలుగానే కని పించాయి. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకూ పరీక్ష జరిగింది. అయితే అభ్యర్థులను అంతకంటే ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. జేసీ చిన్న రాముడు స్వీయ పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలను ఎస్‌టీఐ స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించారు.దీంతో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, ఆర్ట్స్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రశాంతి తనిఖీ చేశారు.కేశవరానికి చెందిన ఓ విద్యార్థి భారతీయ విద్యాభవన్‌లో చదువుతున్నాడు. ఎస్‌కేవీటీ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉంది. ఆ విద్యార్థి కారులో వచ్చినా ఎస్‌కేవీటీకి మూడు గేట్లు ఉండ డంతో అయోమయానికి గురయ్యాయని..ఎంట్రన్స్ గేటు వద్దకు వచ్చే సరికి సమయం మించి పోయిందని ఆవేదన చెందాడు. 12 నిమిషాలు ఆలస్యం కావడంతో అతడిని పరీక్షకు అనుమతించలేదు.గర్ల్స్ హైస్కూల్‌లో పరీక్ష రాయాల్సి ఉండగా.. ఎస్‌కేవీటీకి వచ్చిన ఆ విద్యార్థినిని ఓ మహిళా కానిస్టేబుల్ తన వాహనంపై గర్ల్స్ కళాశాలకు తీసుకెళ్లడంతో చివరి నిమిషంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో ఊపిరి పీల్చు కుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 720 మంది విద్యార్థులకు 693 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు కె. సుబ్బారావు, పి.విజయనిర్మల తెలిపారు. పరీక్షా కేంద్రాలను జేసీ చిన్నరాముడు, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ శ్రీకాంత్, రాజానగరం తహశీల్దార్ జి.ఎఎల్ఎస్.దేవి, సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యాగౌడ్ సందర్శించారు.విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

వానావరణం!

మారిన వాతావరణం

- మండు వేసవిలో జోరువానలు
- పల్లపు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జనజీవనం
- అన్నదాతల్లో అయోమయం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజమహేంద్రవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇది ఎండాకాలమా.. వానాకాలమా.. కాదు కలికాలం.. ఇదీ జనం మాట.. ఎందుకంటే నిండు వేసవిలో జోరువానలు చూసి నోటమాట రావడంలేదు. వానలకు పట్టణ జనాభా సేదతీరుతుంటే పల్లె జనం మాత్రం పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా ప్రతి రోజూ ఉదయం ఎండ కారణంగా ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరై సాయంత్రం వానతో సేదతీరుతున్నారు. అయితే ఆదివారం మాత్రం వరుణుడు భానుడికి చోటివ్వలేదు.. తెల్లవారుజాము నుంచే దంచి కొట్టాడు. రాజమహేంద్రవరంలో ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటలకు ఏకధాటిగా కురిసిన వానతో జనజీవనం స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే వర్షం ఆరంభం కావడంతో మార్కెట్లకు వెళ్లడానికి కూడా జనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం నుంచి కాస్త తెరిపిచ్చింది. సోమవారం కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈదురుగాలులు లేకపోవడం కాస్త ఉపశమనం కలిగించింది. తాళ్లపూడి మండలంలో గరిష్ఠ వర్షపాతం నమోదు కాగా.. నిడదవోలులో కనిష్ఠంగా వర్షపాతనమోదైంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో డ్రెయినేజీలు షరా మామూలుగానే పొంగి పొర్లాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా మునిసిపల్ కార్పొరేషన్ సొమ్ములను ఖర్చు పెట్టి డ్రెయినేజీలు నిర్మించారు. అయినా ముంపు సమస్య నుంచి నగరాన్ని బయటపడేయలేకపోయారు. డ్రైన్లలోని మురుగునీరు రోడ్లపై పారడం, పల్లపు ప్రాంతాలు చెరువులను తలపించడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. రైల్వేస్టేషను, తమ్మలావ,కంబాల చెరువు, ఆర్టీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఎప్పటి మాదిరిగానే రోడ్లపై, వీధుల్లో ముంపు నీరు నిలిచిపోయింది. ద్విచక్ర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రమాదకర హోర్డింగ్‌లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను గమనించాలన్నారు. భారీ హోర్డింగ్‌లను తనిఖీ చేసి ఏదైనా ఇబ్బంది వస్తుందని గుర్తిస్తే వెంటనే తొలగించాలని ఆదేశించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు.మూడు రోజులు పని చేసే విధంగా జిల్లా కేంద్రం,డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.వర్షాల వల్ల ప్రతికూల పరిస్థితులు తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1070 1800 425 0101, 83339 05022 లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 89779 35611,రాజమహేంద్రవరం ఆర్డీవో 0883 2442344,కొవ్వూరు ఆర్డీవో 850 0667698కి సమాచారం అందించాలన్నారు.

వర్షపాతం ఇలా..

మండలం	వర్షం(మి.మీ)
తాళ్లపూడి	65.00
కొవ్వూరు	57.25
రాజమండ్రి అర్బన్	49.00
సీతానగరం	41.25
కోరుకొండ	36.50
గోపాలపురం	32.0
సీతానగరం	29.5
రాజానగరం	24.75
బిక్కవోలు	23.75
అనపర్తి	20.25
నల్లజర్ల	19.75
రంగంపేట	19.25
ఉండ్రాజవరం	15.50
నిడదవోలు	13.50



వానొచ్చే : రాజమహేంద్రవరంలో ఆదివారం ఉదయం జోరువాన



రోడ్డా..చెరువా : రాజమహేంద్రవరంలో పల్లపు ప్రాంతాల జలమయం







అన్నదాత ఆందోళన : దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద ఇలా...

పోతవరానికి సివిల్స్ ర్యాంకర్ కీర్తిరెడ్డి రాక



కీర్తిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో 316వ ర్యాంకు సాధించిన శ్రీనివాస కీర్తిరెడ్డి, ఆమె భర్త శ్రీసాయి (ఐఏఎస్ అధికారి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇన్ఫర్‌మేషన్ బ్రాడ్‌క్రాస్టింగ్ అధికారి. విజయవాడ) ఆదివారం పోతవరం లోని వారి బంధువుల ఇంటికి వచ్చారు. వారిని వారి సమీప బంధువు గన్నమనేని దొరయ్య, సోదరులు గన్నమనేని వెంకటేశ్వ రరావు, ప్రభాకరావు మాజీ సర్పంచ్ పసుమర్తి రాధ పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలతో సత్కరించారు.ఆగస్టు నెలలో తాను శిక్షణకు వెళుతున్నట్లు కీర్తిరెడ్డి (కడప) చెప్పారు. బిట్స్‌పిలానీలో ఇంజనీరింగ్ చేశానని, మాల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చిన కాదని పెళ్ళి అయినగాని సివిల్స్ సాధించాలనే పట్టుదలతో 5సార్లు విఫలం అయిన 6సారి రేట్టింపు ఉత్సహంతో 316వ ర్యాంకు సాధించినట్లు కీర్తిరెడ్డి వివరించారు. రోజు దాదాపు 8గంటలు చదివనని, మొదటి మూడు సార్లు ఏటామ్ చేసిన పాసై అవుతననే నమ్మకం లేదన్నారు.మన మీద మనకు నమ్మకం ఉంటే సివిల్స్ సాధించడం కష్టం కాదని మూడోసారి రాసిన తరువాత తెలుసుకున్నానన్నారు. 6వ సారి విజయం సాధించడం ద్వారా ఆనందంగా ఉందన్నారు. విజయం వెనుక భర్త, అత్తమామల ప్రోత్సాహం ఉందన్నారు.

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి



చాగల్లులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు (ఫైల్)

చాగల్లు, మే 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం నాయకుడు జీవీ సుబ్బారావు కోరారు. ఈ సందర్భంగా ఆయన చాగల్లులో మాట్లాడుతూ ప్రభుత్వం టార్గెట్లు పెంచి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థా యిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలో ధాన్యం మాసూ ళ్లు దాదాపుగా పూర్తయ్యాయి. రబీ సీజన్‌లో 8,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు. కోతలు దాదాపుగా పూర్త య్యి, ధాన్యం కూడా చాలా వరకు ఒబ్బిడి అయ్యింది. దిగుబడి సైతం ఆశాజనకంగానే ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎకరాకు 55 బస్తాల నుంచి 60 వరకు దిగుబడి సాధించినట్లు చెబుతున్నారు.

నేటి నుంచి ఏపీటీఎఫ్ ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

కొవ్వూరు, మే 4 (ఆంధ్ర జ్యోతి) : విద్యా రంగంలో సంస్కరణల పేరుతో 117 జీవోతో ప్రయోగాలు చేయడం బాధాకరమని ఏపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. ఆదివారం స్థానిక హోలీ ఏంజిల్స్ పాఠశాలలో ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం నుంచి దశలవారీగా ఏపీటీఎఫ్ ఉద్యమాలు చేపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 9 రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధనే లక్ష్యంగా మూడంచెల కార్యాచరణలో భాగంగా సోమవారం పాత తాలూకా కేంద్రాల్లో, 9వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద, 14వ తేదీన రాష్ట్రస్థాయి ధర్నా విజయవాడలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సీనియర్ నేత షేక్‌జానీ, తాళ్లపూడి మండల ప్రధాన కార్యదర్శి యాదం శంకరం, రాష్ట్ర కౌన్సిలర్ సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు మంత్రి ఆదేశం

నిడదవోలు, మే 4(ఆంధ్రజ్యోతి) : మండలంలో 5,020 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు వియత్నాం పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని 21 గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే నియోజకవర్గంలోని మిగతా ప్రాంతాల్లో కూడా కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అకాల వర్షం... రైతులకు నష్టం



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు



పెరవలిలో జోరుగా కురుస్తున్న వర్షం



దేవరపల్లి : యర్నగూడెంలోని ఓ వీధిలో ...

- పలుచోట్ల తడిసిపోయిన ధాన్యం రాశులు
- లోతట్టు ప్రాంతాలకు చేరిన వర్షపు నీరు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు ఆకాశం మేఘావృత్తమై ఉరుములతో కూడిన వాన పడింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఫైర్ స్టేషన్ సెంటర్, పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గత కొద్ది రోజులుగా ఎండతో అల్లాడిన ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

పెరవలి: అకాలవర్షాలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తడిసిపోయిన ధాన్యం మిల్లుకు తరలించడానికి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా మొక్కజొన్న, ఖోఖో రైతులు కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు.



తీపర్రులో వర్షంలో ఖోఖో గింజలు తీస్తున్న దృశ్యం



అన్నవరప్పాడు వద్ద పాడైపోయిన ఇటుకలు

దేవరపల్లి: మండలంలో ఆదివారం రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా గౌరీపట్నం, దుద్దుకూరు, కృష్ణంపాలెంలోని జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం కుప్పలపై బరకాలు కప్పినప్పటికీ ధాన్యం తడిసిపోయాయి. దీనివల్ల ధాన్యానికి తేమచేరి 30 శాతం వరకు రంగుమారుతుందని, దీంతో నష్టపోయే అవకాశం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల్లోని పల్లపువీధుల్లోని డ్రైన్లు నిండిపోయాయి.

ఉండ్రాజవరం: మండలంలో ఆదివారం సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. పం అన్నవరప్పాడువద్ద వర్షానికి తడిచి పాడైపోయిన ఇటుకలుడించిన పంటను రోడ్లు, కల్లాల్లో రాసులుగా ఆరబెట్టారు. గాలివాన ఒక్కసారిగా రావడంతో ధాన్యం రాసులను ఒబ్బిడి చేయడానికి నానా అగచాట్లు పడ్డారు. ఆరుగాలం పండించిన పంటను చేతికి వచ్చేసరిగి వర్షాలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సూర్యారావుపాలెం, కాల్దరి, పసలపూడి, ఉండ్రాజవరం, తదితర గ్రామాల్లోని రైతులు కూడా ఇబ్బందులు పడ్డారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్స వం, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు ఆలయ కమిటీ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం విలేఖర్ల సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు వివరాలు తెలియజేస్తూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. 5వ తేదీన ఆలయం వద్ద సేనాధిపతి శ్రీవిశ్వక్‌సేన తిరువీధోత్స వం, 6వ తేదీన శ్రీవారి మూల మూర్తి స్నపనతిరుమంజనం, ధ్వజారోహణ, గరుడ ఉత్సవం, 7వ తేదీన ఉదయం కుంభారాధన, నిత్యహోమం శ్రీవారి రథోత్సవం, సాయంత్రం శ్రీనివాస కల్యాణ మహోత్సవం, తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారుల బృందంచే అన్నమాచార్యుల సంకీర్తన స్వరాభిషేకం, 8వ తేదీన కూచిపూడి నృత్యప్ర దర్శన, కేసిరాజు శారదదేవి వారి బృందంచే సంగీత సంకీర్తనామృతం, 10వ తేదీన భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడానికి మండలంలోని పలుగ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చాయి. దీనికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కార్యక్రమంలో గుడ్ల వెంకటేశ్వరరావు, వెలగా శ్రీనివాస్, కొండపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు చివటంలో ఉచిత వైద్య శిబిరం

- నిర్వాహకుడు అబ్బులు

ఉండ్రాజవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): చివటంలో ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక జేసీఎం చర్చి వద్ద నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు టి. అబ్బులు తెలిపారు. ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో ఆర్థో, న్యూరో, జనరల్ మెడిసిన్, గుండె, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు సంబంధించి వైద్యనిపుణులచే పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన జీడిమామిడి, మామిడి, కొబ్బరి, అరటి పంటలకు నష్టపరిహారం చెల్లించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ తెలిపారు. వర్షం వల్ల మెట్ట పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఏజన్సీలో ఆదివాసీలు ఈ పంటల మీద ఆధారపడే జీవిస్తున్నారన్నారు. వారిని ప్రభుత్వాలు ఆదుకుని ఎకరాకి రూ. 50 వేలు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

మెరకవీధి విఘ్నేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెరకవీధి 2వ వార్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా వేదపండితులు బ్రహ్మశ్రీ గోవిందురే సత్యనారాయణ శాస్త్రి, దాసరాజులు కామేష్‌శాస్త్రి బృందం ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం విఘ్నేశ్వరస్వామి విగ్రమానికి జీర్ణోద్ధారణ, గణపతి హోమం, మహా చండీ యాగం, విశేష పూజలు చేశారు. ఆదివారం స్వామి వారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేగల రామకృష్ణ, విజయలక్ష్మి, తిరుమళ్ల గణపతి, తులసీ, దేగల సత్యమూర్తి, సంధ్యారాణి, మద్దిపట్ల సురేష్, గీత, దేగల రామ్‌కుమార్, నిఖిత దంపతులు పీఠాలపై కూర్చుని పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): కిట్స్ ఇంజనీరింగ్‌లో 3వ సంవత్సరం చదువుతున్న హారికేశ్వరి అనే పేద విద్యార్థినికి భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆర్థిక సాయం అందించారు. స్థానిక తిలక్ రోడ్డులో తన కార్యాలయంలో ఆదివారం హారికేశ్వరికి రూ. 26 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



స్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని పాతవూరులో వేంచేసియున్న ఉమా చోడేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం కొవ్వూరు పట్టణానికి చెందిన బాలప్ప ప్రసాద్, జానకీ దంపతులు పీఠలపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి శ్రీసూక్త విదానంలో కుంకుమ పూజలు, స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కౌతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పమ్మి రవిబాబు, గరిమెళ్ల సత్యనారాయణ శర్మ, అప్పల అయ్యపరాజు, ప్రవ సుబ్రహ్మణ్యశర్మ, చిరవూరి సుబ్రహ్మణ్యం, చవలి దుర్గాప్రసాద్, కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం భాగ్యం కలిగింది. అన్ని విరాళాల ద్వారా మొత్తం రూ.1,34,020 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం



అన్నపూర్ణ నగర్‌లో హనుమాన్ చాలీసా పారాయణం చేసిన భక్త బృందం

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నపూర్ణ నగర్ రామాలయం వద్ద ఆదివారం రామదూత హనుమాన్ చాలీసా పారాయణం భక్త బృందం 108 సార్లు పారాయణం చేశారు. హనుమంతుడికి తమలపాకులు సింధూరంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమంలో విస్సాప్రగడ మోహనకృష్ణ దంపతులు, పసుపులేటి రామకృష్ణ దంపతులు, గమిని వెంకటరత్నం, కె.సత్యవతి, నార్ల సత్యవతి, ఎం.ఆంజనేయులు , తదితరులు పాల్గొన్నారు.

హత్య సంఘటనతో ఉలిక్కిపడిన ఊరు

- పాత కేసులో రాజీ పడకపోవడంతో వలీని హత్య చేసిన అనిల్ కుమార్



మృతుడు షేక్ వలీ బాషా (ఫైల్)

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓ అమ్మాయిని అల్లరి చేసిన ఘటనలో నమోదైన కేసు తుది దశకు రావడంతో శిక్ష పడుతుందేమోనన్న భయం ఒక పక్క... మరో పక్క ఆ అమ్మాయి కుటుంబ సభ్యులతో రాజీకి యత్నించినప్పటికీ వాళ్లు ఒప్పుకోకపోవడం ఇంకో పక్క.... దీంతో సదరు వ్యక్తి ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం నిడదవోలు పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.జి.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాటిమీద చింతచెట్టు వీధిలో నివాసం ఉంటున్న షేక్ వలీబాషా (46) ఆదివారం ఉదయాన్న నిద్రలేచి తన ఇంటి కింద ఉన్న కిళ్లీ షాపు తెరుస్తుండగా, స్థానిక వైయస్సార్ కాలనీకి చెందిన శిరంగుల అనిల్ కుమార్ వేట కత్తిను తీసుకొచ్చి వలీబాషాను హత్య చేసినట్టు మృతుడి భార్య షేక్ రెహానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే హత్యకు పాల్పడిన నిందితుడు శిరంగుల అనిల్ కుమార్ లారీడ్రైవర్ అని, 2021లో మృతుడు వలీ బాషా కుమార్తెను అల్లరి పెట్టడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యిందని, ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతుందని, తనపై కేసు ఉండడంతో పెళ్లి కావడం లేదని మరో పక్క ఈ కేసులో శిక్ష పడుతుందనే భయంతో ముద్దాయి శిరంగుల అనిల్ కుమార్ మృతుడు వలీబాషాను రాజీ చేసుకుందామంటూ చాలా కాలంగా తిరుగుతున్నాడని తెలిపారు. అయితే మృతుని కుటుంబ సభ్యులు రాజీ చేసుకునేం దుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ముద్దాయి పథకం ప్రకారమే వేటకత్తితో వచ్చి దాడి చేసి హత్య చేశాడని పేర్కొన్నారు. హత్య వార్త పోలీసులకు సమాచారం అందిన అరగంటలోనే సీఐ తిలక్ తన సిబ్బందితో ముద్దాయిని అరెస్ట్ చేసారు. మృతుని భార్య షేక్ రెహానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి పట్టణంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో మే 5వ తేదీ నుంచి 15 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. 5వ తేదీన గౌతమీ నగర్ అంగన్వాడీ కేంద్రం, 6వ తేదీన శంకర మఠం (సుబ్రహ్మణ్యస్వామి గుడి) అంగన్వాడీ కేంద్రం, 7వ తేదీన శ్రీరామకాలనీ సచివాలయం ప్రక్కన అంగన్వాడీ కేంద్రం, 8వ తేదీన ఆంధ్రబ్యాంకు వీధి అంగన్వాడీ కేం ద్రం, 12వ తేదీన ముస్లిం స్కూల్ (వాటర్‌ట్యాంకు ఏరియా) అంగన్వాడీ కేంద్రం, 13వ తేదీన రామా సొసైటీ (ఆనందలహరి స్కూల్) అంగన్వాడీ కేంద్రం, 14వ తేదీన అచ్చాయమ్మకాలనీ (ఎలిమెంటరీ స్కూల్) అంగన్వాడీ కేంద్రం, 15వ తేదీన శ్రీనివాసపురం (ఎలిమెంటరీ స్కూల్) అంగన్వాడీ కేంద్రాలలో ఉద యం 9 గంటల నుంచి ప్రత్యేక క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు.

మాజీమంత్రి ఇంట్లో దొంగతనంపై కేసు

- రూ. 2,40,000 విలువైన వస్తువులు అపహరణ

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి కేఎస్ జవహర్ ఇంట్లో దొంగలు పడి రూ. 2,40,000 విలువైన వస్తువులు దొంగిలించుకుపోయినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. నందమూరు రోడ్డులో జవహర్‌కు ఇల్లు ఉంది. అయితే కుటుంబ సభ్యులు గత నెల 28వ తేదీన ఇంటికి తాళాలు వేసి తిరువూరు మండలం గానుగపాడు వెళ్లి, ఈనెల 3వ తేదీ సాయంత్రం 4-30 గంటల సమయంలో మొక్కలను నళ్ల పోయడానికి వీధి రాజు వచ్చాడు. అయితే ఇంటి వెనుక తులుపులు అప్పటికే తెరచి ఉండడంతో జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశీష్ అమృత్‌లాల్‌కు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన బయలుదేరి కొవ్వూరు వచ్చి చూడడంతో ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. అందులోపలికి వెళ్లి చూడగా హాలులో తలుపులు పగలగొట్టి బెడ్‌రూమ్‌లోని మూడు ఐరన్‌కేఫ్‌ల తలుపులు తెరిచి, లోపల ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తీరా ఇంట్లో పరిశీలించగా నాలుగు బంగారు ఉంగరాలు (సుమారు 4 కాసులు), 4 సిల్వర్ ప్లేట్లు (సుమారు 2 కిలోగ్రాములు), రూ. 45 వేలు నగదు, వాచీ, 32 ఇంచెస్ సామ్‌సంగ్ టీ.వీ, 2 సామ్‌సంగ్ మొబైల్స్, కొన్ని పట్టుచీరలు కలిపి మొత్తం రూ. 2,40,000 విలువైన వస్తువులు దొంగిలించుకుపోయారు. దీనిపై జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశీష్ అమృత్‌లాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జి. దేవకుమార్, పట్టణ సీఐ పి. విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజమహేంద్రవరం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి దొంగతనానికి సంబంధించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, మే4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, మళ్లీ సంక్షేమ పథకాలను ప్రారంభించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక జూపూడి ఫంక్షన్ హాలులో సమాఖ్య నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సతీష్ శర్మకు నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుల్లేటి సూర్య వెంకటరావు సారథ్యంలో ఏర్పాటు చేసిన సత్కార సభలో సతీష్ మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక దేవాదాయ ధర్మాదాయ శాఖ పాలకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.324 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అనంతరం సతీష్ శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యవాడ దుర్గాప్రసాద్, శ్రీదేవి, పులిపాక ప్రసాద్, కేవీఎల్ఎన్ రామచంద్రమూర్తి, వాడ్రేవు వేణుగోపాలరావు, కొత్తపల్లి సూర్యకుమారి, కలగ ప్రభాకరం, కామేష్ పాల్గొన్నారు.

ఉచిత కార్పొరేట్ విద్య కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, అట్టడుగు వర్గాలు, అనాథలు, సింగిల్ పేరెంట్ పిల్లలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ విద్య కోసం దరఖాస్తులు కోరుతున్నామని స్పృహ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మధుసూదనరావు, కూర్మారావు, రూపస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25లో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఈనెల 7వ తేదీ గడువు అని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాజమహేంద్రవరం కేంద్రంగా రాత పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు.